అభివృద్ధి పనులు గుర్తుండేలా...

- శిలాఫలకాలు ఏర్పాటు చేయండి
- మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్) మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: అభివృద్ధి పనులు గుర్తుండేలా ప్రభుత్వం నిర్వహించిన పనులకు శిలాఫలకాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆయా కాంట్రాక్టర్లను కోరారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో నిర్వహించిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఆయా వార్డుల్లో శిలాఫలకాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘంలో విలీన గ్రామమైన గణపవరం వాటర్ స్కీమ్‌కు సంబంధించి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు, ఇతర పనులకు సంబంధించి రూ.16 లక్షల బిల్లులు చెల్లించలేదని, ఆ బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు సమాధానం చెబుతూ ఆయా పనులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్వహించినందున బిల్లులు చెల్లించేందుకు సీడీఎంఏ అనుమతులు కావాల్సి ఉందని, అనుమతులు ఇవ్వాల్సిందిగా ఇప్పటికే లిఖిత పూర్వకంగా కోరినట్లు వెల్లడించారు. సీడీఎంఏ అనుమతులు వచ్చాక మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి..

వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణం నుంచి వెలువడే మురుగునీరు గణపవరం డొంక మీదుగా వాగుకు పంపే క్రమంలో మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బందిగా ఉందని సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రెవెన్యూ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేసిన అవినీతితో పాటు, షరాఫ్ విభాగంలో జరిగిన అవినీతిపై వివరణ ఇవ్వాలని కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయంలో ఆర్డీఎంఏ విచారణకు ఆదేశించారని, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి రెవెన్యూ అధికారుల బృందం విచారణ నిర్వహిస్తోందని, విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. షరాఫ్ విభాగానికి సంబంధించి జెస్సీ ప్రవీణ్ అనే ఉద్యోగిని సస్పెండ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ వెంటనే పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ గతంలోనే పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరినట్లు వివరించారు. ఇదే విషయాన్ని మరోమారు జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వివిధ సమస్యలపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలి

కౌన్సిల్‌లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ(నూజెండ్ల): మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటితో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిల్ సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అజెండాలో పొందుపరచిన అంశాలను సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈఈ వెంకయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు దేవదాయ భూముల కౌలు హక్కుల వేలం

నాదెండ్ల: దేవదాయ శాఖ ఆధీనంలోని వ్యవసాయ భూములకు జూలై ఒకటో తేదీన కౌలు హక్కుల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.తులసిదాస్ చెప్పారు. నాదెండ్ల గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు బహిరంగ కౌలు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. అప్పాపురం ఆంజనేయస్వామి దేవస్థానం ఆధీనంలోని 12.53 ఎకరాలు, నాదెండ్ల అన్నదాన సత్రం ఆధీనంలోని 5.66 ఎకరాలు, నాదెండ్ల మూలస్థానేశ్వర స్వామి ఆలయం ఆధీనంలోని 30.50 ఎకరాలు, నాదెండ్ల గోవర్ధనస్వామి దేవాలయం ఆధీనంలోని 127.92 ఎకరాలకు కౌలు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే రైతులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు జిరాక్సు ఇవ్వాలని కోరారు. దేవదాయశాఖకు బకాయిలు ఉన్న వారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవాలు



నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండ రోడ్డు శ్రీనివాసనగర్‌లోని గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవ, కల్యాణ వేడుకలు శనివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ ధర్మప్రచార పరిషత్ మాజీ కార్యదర్శి చిలకపాటి విజయరాఘవాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు సాతులూరి రఘుపతిస్వామి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం ఆలయంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురారోపణం, సోమకుంభ స్థాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. జూలై ఒకటో తేదీ ఉదయం 10గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం గరుడోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు రఘుపతిస్వామి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు కాకాని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామిశెట్టి గోవిందరాజులు తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 14 ఏళ్ల లోపు బాల, బాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరవ్వాలనే ఉద్దేశంతో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మిర్చి వ్యాపారి కారు అద్దాలు ధ్వంసం



నాదెండ్ల: గణపవరం నూతన కోదండరామాలయం వెనుక వీధిలో నిలిపి ఉన్న కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడు మారడుగు కృష్ణ తెలిపిన వివరాలు.. మిర్చి వ్యాపారం చేస్తుంటానని, తన ఇంటి ముందు కారును నిలిపిఉంచగా, రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేశారన్నారు. విషయాన్ని పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా అద్దాలు ధ్వంసం చేశారని వాపోయాడు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

నరసరావుపేట రూరల్: జూలై సామాజిక భద్రత పింఛన్లు ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కేఏస్ రవికాంత్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 12,674 మంది లబ్ధిదారులకు రూ.8.61,76,500 పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నగదును పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శుల ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నగదును డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉన్నారని వివరించారు. నూరు శాతం పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించారు. సిబ్బంది ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని స్పష్టంచేశారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి రోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఉసర్తి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కేవీ శివప్రసాద్, సీనియర్ సహాయకులు శ్యాంప్రసాద్, సిబ్బంది దాసు, రజనీ పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రవికాంత్

రేపు ఇంటివద్దే పింఛన్లు పంపిణీ

నాదెండ్ల: మండల పరిధిలో అన్ని గ్రామాల్లో జూలై ఒకటిన సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ శనివారం తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 5 గంటల నుంచి సాయంత్రంలోగా అన్ని పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండల పరిధిలో 9644 మంది లబ్ధిదారులకు గాను రూ.6,54,86,000 పంపిణీ చేయనున్నట్లు వివరించారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల చొప్పున, పూర్తిస్థాయి వికలాంగులకు రూ.6 వేలు చొప్పున మూడు నెలల బకాయిలతో కలిపి చెల్లించనున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రామాచారికి సన్మానం



వినుకొండ(నూజెండ్ల): ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావం, సామాజిక బాధ్యత, సేవాభావంతో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వి.రామాచారి అందరికీ ఆదర్శప్రాయుడని నడిగడ్డ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.హనుమంత్‌కుమార్ అన్నారు. పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు రామాచారి, ఈశ్వరమ్మ దంపతులను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ నడగడ్డ పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఉపాధ్యాయ సంఘం యూనియన్ నాయకులుగా హక్కుల కోసం పాటుపడ్డారని, ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారని గుర్తుచేశారు. రామాచారి విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరరావు, హరికృష్ణ, జి.రవికిరణ్‌కుమార్, మేరీప్రసన్న, బి.ఏసత్తార్, నాగరాజు, జి.నాగేశ్వరరరావు, ఎం.వినాయక్, సుభాషిణి, కరీముల్లా, కిరణ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నాదెండ్ల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఏఎం గ్రూపు కళాశాలల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు చెప్పారు. కనపర్రు శివారు మైనంపాడు నైస్ పాఠశాల ఆవరణలో శనివారం సామాన్యుల కోసం చట్ట విజ్ఞానం, హిందూ వారసత్వహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అంశాలపై నరసరావుపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు. విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డి.శ్రావ్య, లా కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరబ్రహ్మం, నైస్ పాఠశాల ప్రిన్సిపాల్ గణపతి, నరసరావుపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సెక్రటరీ ఏడుకొండలు, నైస్ పాఠశాల ఫౌండర్ పూర్ణచంద్రరావు, సర్పంచి పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి కాంతారావు, వీఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సదుపాయాల కల్పనపై దృష్టి సారించండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: పేదలు ఎక్కువగా నమ్ముకునే ప్రభుత్వాస్పత్రుల్లో సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శనివారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. వైద్య ఆరోగ్య రంగాన్ని గాడిలో పెట్టే చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం వస్తుండడంతో వ్యాధులు ప్రబలకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఆగిన ఆరోగ్య శ్రీ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట రాష్ట్ర బులియన్ గోల్డ్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్ ఉన్నారు. పల్నాడు జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షించాలని గుంటూరు రేంజి ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. ఈ మేరకు ఐజీని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు.



మంత్రి సత్యకుమార్‌తో సమావేశమైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైలును సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ శనివారం సందర్శించారు. ఖైదీలకు అందించే ఆహారం, స్టోర్ రూమ్‌లో సరుకు నిల్వలు వంటి వాటిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖైదీలతో న్యాయసేవల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.వెంకట రత్నం, న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సబ్ జైల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కూడా వారు సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పెడుతున్న భోజనం, ఇతర ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్

నాదెండ్ల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు వ్యాధి బారినపడకుండా పరిశుభ్రమైన తాగునీరు, తాజా ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ సూచించారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాయిశ్వేత అధ్యక్షతన డయేరియాపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా నిర్వహించేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూలై ఒకటి నుంచి నెలాఖరు వరకూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా వ్యాధికి గురైతే సత్వరమే ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్య సేవలు పొందాలని సూచించారు. డాక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛమైన తాగునీటిని తీసుకోవాలని, లేదా కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలన్నారు. అనంతరం వ్యాధి ప్రబలకుండా రూపొందించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, మలేరియా శాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



నాదెండ్ల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్

వార్డుల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మాచర్ల: పట్టణంలోని 18వ వార్డులో అధ్వానంగా మారిన పరిసరాలను పురపాలక సంఘం ఏఈ చంద్రశేఖర్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి షేక్ షాహినాలు శనివారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. బోరు మరమ్మతులు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు, కాల్వల్లో పేరుకుపోయిన మురుగు తదితర అంశాలను అధికారులు తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డయేరియా పెరుగుతున్నందున ముందస్తుగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీరి వెంట కంభంపాటి అనిల్‌కుమార్, దుర్గారావు, స్థానికులు ఉన్నారు.

పన్నులు చెల్లింపునకు నేడు ప్రత్యేక కౌంటర్

నరసరావుపేట: ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు వడ్డీ లేకుండా చెల్లించేందుకు పురపాలక కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారంతో గడువు ముగుస్తున్నందున పన్ను చెల్లింపు దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షాకాలం.. దోమలు వృద్ధి చెందే కాలం

- దోమకాటు రక్షణకు దోమతెరలు వాడాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెంది పలు రకాల జ్వరాలు దోమకాటు ద్వారా వస్తాయని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. దోమ కాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. మలేరియా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు పట్టణంలోని శ్రీనివాసరావుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్ఓ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు మొదలైన రీత్యా పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల, ఆ ప్రదేశాలు దోమలకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. నీరు నిల్వ లేకుండా తరచుగా పరిసరాలు శుభ్రపరచుకోవాలన్నారు. ఇళ్లలోని తొట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన టీ కప్పులు, పాత రోళ్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో నివారణ చర్యలను తరచుగా చేపట్టాలన్నారు. సాయంత్రం సమయంలో వేప పొగ పెట్టడం, దోమతెరలు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమకాటు నుంచి రక్షించుకోవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, దోమల నివారణ చర్యలపై ప్లకార్డులు చేతబూని, నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయుడు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు నాయక్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి